RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in  rajadhanivoicedaily@gmail.com

RAJADHANI VOICE రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు మండలాల వారిగా విలేఖరులు కావవలెను ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 278 | 30 ఆదివారం ఆగష్టు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట... ఇప్పుడొక మాట: చంద్రబాబు

**ఏకగ్రీవాలపై గత ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని సీఎం చంద్రబాబు విమర్శ**

**గిరిజన ప్రాంతాల్లో 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందించే కార్యక్రమానికి శ్రీకారం**

**రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన**

**గత పాలనలో జే బ్రాండ్లు, బలవంతపు మత మార్పిడులతో రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపణ**

**సెప్టెంబర్ 2న అనకాపల్లికి గోదావరి జలాలు, 31న వెలిగొండకు కృష్ణా జలాలు విడుదల**



**రాజధాని వాయిస్ అరకు, ఆగస్టు 29 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల విషయంలో గత పాలకులు ఇప్పుడు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించి, ఇప్పుడు వాటిని వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అరకు నియోజకవర్గంలోని గన్నెలలో శనివారం జరిగిన 'సంజీవని' ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారం కోల్పోయాక మరో మాట మాట్లాడటం వారి నైజానికి నిదర్శనం" అని చంద్రబాబు అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవం అయితే, సదరు నియోజకవర్గ ఇన్చార్జిదే బాధ్యత... వచ్చే ఎన్నికల్లో వారికి టికెట్ ఉండదు అని జగన్ వైసీపీ నేతలను హెచ్చరించిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించారని చంద్రబాబు ఆరోపించారు. '

## ఆ ఫుడ్ ప్యాకెట్లపై 'రెడ్ మార్క్'..!

ప్యాక్ చేసిన ఆహార పదార్థాలపై ఆరోగ్య హెచ్చరికలు ముద్రించే విషయానికి సంబంధించి భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (FSSAI) కీలక విషయాన్ని ప్రతిపాదించింది. అధిక స్థాయిలో కొవ్వు, చక్కెర, ఉప్పు ఉందని తెలిసేలా ప్యాకెట్లపై ఎరుపు హెచ్చరిక గుర్తును ముద్రించాలని పేర్కొంది. సరైన ఆహార పదార్థాలను ఎంపిక చేసుకోవడంలో వినియోగదారులకు ఈ సమాచారం దోహదం చేస్తుందని తెలిపింది. ఈ మేరకు సుప్రీం కోర్టు కు సమర్పించిన అఫిడవిట్‌లో ఈ విషయాలు వెల్లడించింది."ఆహార ఉత్పత్తిపై అధిక కొవ్వు, అధిక చక్కెర, అధిక ఉప్పు ఉందని తెలిసేలా హెచ్చరిక గుర్తు ఉండాలి. రెండు, అంతకన్నా ఎక్కువ ఆందోళన కలిగించే పోషకాలు అధిక స్థాయిలో ఉన్నాయని వినియోగదారులు తేలికగా గుర్తించేందుకు వీలుగా షట్కోణ ఆకారంలో ఎరుపు రంగు గుర్తును ముద్రించాలి. ఇందుకోసం ఐసీఎంఆర్–ఎన్ఐఎన్ 2024లో నిర్దేశించిన పోషకాల పరిమితులనుపరిగణనలోకి తీసుకోవాలి" అని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది.ప్యాక్ చేసిన ఆహార ఉత్పత్తులపై హెచ్చరిక గుర్తులను తప్పనిసరి చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ జే బీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం ఇటీవల విచారించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం.. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం కోరుకోవడం లేదా? అని ప్రశ్నించింది. రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసిన నేపథ్యంలో భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ ఈ చర్యలకు ఉపక్రమించింది.

## చెట్లు నాటే సంస్కృతే కూటమి లక్ష్యం

**– పర్యావరణ పరిరక్షణకు నాగబాబు పిలుపు – అరణ్యారామంలో రావి--వేప మొక్కల నాటకం – అశ్వత్థ నారాయణ వివాహం సంప్రదాయానికి ప్రాధాన్యం**

**– హరిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రజల భాగస్వామ్యం అవసరం**



**రాజధాని వాయిస్ మంగళగిరి :** హరిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదెల నాగబాబు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని అరణ్యారామం నందవనంలో నిర్వహించిన రావి--వేప మొక్కల నాటే కార్యక్రమంలో నాగబాబు తన సతీమణి పద్మజతో కలిసి పాల్గొన్నారు. శాస్త్రోక్త పూజల అనంతరం వారు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన నాగబాబు, భూమాతను కాపాడుకోవడం ప్రతి మనిషి బాధ్యత మాత్రమే కాకుండా కర్తవ్యమని అన్నారు. మన జీవనానికి అవసరమైన ఆహారం, నీరు, గాలి, నివాసం వంటి అన్ని వనరులు భూమాత నుంచే లభిస్తున్నాయని గుర్తు చేశారు. అడవుల నరికివేత, విచక్షణారహిత మైనింగ్, కాలుష్యం వంటి చర్యల ద్వారా ▶▶2

## తమిళనాడు గవర్నర్‌గా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి



**– ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎంకు కీలక బాధ్యత**

**– రాజకీయ అనుభవానికి గుర్తింపుగా నియామకం**

**– రాష్ట్రపతి ఉత్తర్వులతో నియామక ప్రకటన**

**– పలువురు నేతల అభినందనలు**

**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ, ఆగస్టు 29:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని తమిళనాడు గవర్నర్‌గా నియమించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదంతో ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కిరణ్‌కుమార్ రెడ్డికి దేశంలోని కీలక రాష్ట్రాల్లో ఒకటైన తమిళనాడుకు గవర్నర్ బాధ్యతలు అప్పగించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చివరి ముఖ్యమంత్రిగా సేవలందించారు. శాసనసభ స్పీకర్‌గా, మంత్రిగా, ఎమ్మెల్యేగా వివిధ బాధ్యతలు నిర్వహించిన ఆయనకు పరిపాలనా వ్యవహారాలపై విస్తృత అనుభవం ఉంది. రాష్ట్ర విభజన సమయంలో ముఖ్యమంత్రిగా కీలక పరిణామాలను ఎదుర్కొన్న ▶▶2

## తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకొస్తాం: మంత్రి దుర్గేష్

**- సెప్టెంబర్ తొలి వారంలో నంది నాటకోత్సవాలపై కీలక ప్రకటన**

**రాజధాని వాయిస్ విజయవాడ, ఆగస్టు 29:** మాతృభాషకు సముచిత స్థానం కల్పిస్తూ తెలుగు భాష పరిరక్షణ, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సెప్టెంబర్ మొదటి వారంలో నంది నాటకోత్సవాల నిర్వహణపై కీలక ప్రకటన చేస్తామని, ఏడాదిలోనే నంది నాటకోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు.విజయవాడ గవర్నర్‌పేటలోని డా. బీఆర్ అంబేద్కర్ స్వరాజ్ మైదానంలోని అంబేద్కర్ కళావేదికలో శనివారం తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి పంతులు 163వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ 19 మంది ప్రముఖులకు 'తెలుగు భాషా పురస్కారాలు--2026' అందజేశా రు. పురస్కార గ్రహీతలకు రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం గిడుగు ▶▶2




## పిఠాపురం ఆరోగ్య రంగానికి మహర్దశ

**హామీల అమలుకే ప్రథమ ప్రాధాన్యం..**

**రూ.34 కోట్లతో ఏరియా ఆసుపత్రి ఆధునికీకరణ**



**రాజధాని వాయిస్ పిఠాపురం, ఆగస్టు 29 :** నాణ్యమైన వైద్యం ప్రతి ఒక్కరి హక్కు అనే లక్ష్యంతో పిఠాపురం నియోజకవర్గాన్ని సమగ్ర ఆరోగ్య సేవలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఆసుపత్రుల ఆధునికీకరణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతం, ఆయుష్ వైద్య సేవల విస్తరణతోపాటు వైద్య విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పిఠాపురంలోని 30 పడకల పాత కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.34 కోట్ల అంచనా ▶▶2

## గాంధీభవన్‌లో ఓబీసీ కులగణనపై సమావేశం

**రాజధాని వాయిస్ హైదరాబాద్, ఆగస్టు 29 :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కార్యాలయం గాంధీభవన్‌లో శనివారం ఓబీసీ కులగణన అంశంపై సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల సాధికారత, కులగణన ప్రాధాన్యత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కంచె ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజంలో వెనుకబడిన వర్గాల వాస్తవ పరిస్థితులను అంచనా వేయడంలో కులగణన కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనలో ఖచ్చితమైన గణాంకాల అవసరాన్ని వివరించారు.టీపీసీసీ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వీర్లపల్లి శంకర్, ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, క్రమశిక్షణ కమిటీ కో–చైర్మన్ శ్యామ్‌కుమార్, మాజీ మేయర్ రామ్మోహన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌తో పాటు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు కూడా సమావేశానికి హాజరయ్యారు. ఓబీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులపై సమగ్ర సమాచార సేకరణ అవసరాన్ని వారు ప్రస్తావించారు.సమావేశంలో వెనుకబడిన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం, సంక్షేమ పథకాల అమలు మరింత సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై చర్చ జరిగింది. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో కులగణన గణాంకాల ప్రాధాన్యతను పలువురు నేతలు వివరించారు. ఓబీసీ వర్గాల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. సామాజిక సమానత్వం, సమగ్ర అభివృద్ధి సాధనలో కులగణన కీలకమైన అడుగుగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

## గిరిజనులకు ఇంటి వద్దే వైద్యం

**– అరకులో సంజీవని కార్యక్రమం ప్రారంభం**

**– ఆరోగ్య రథాలకు జెండా ఊపిన సీఎం**

**– డిజిటల్ హెల్త్ సేవలపై ప్రత్యేక దృష్టి**

**– గిరిజన ప్రాంతాలకు మెరుగైన వైద్య సదుపాయాలు**

**– ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**రాజధాని వాయిస్ అరకు, ఆగస్టు 29 :** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు మండలం గన్నెల పంచాయతీ ఆర్కే నగర్‌లో నిర్వహించిన సంజీవని కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల ప్రజలకు ఇంటి వద్దకే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సేవలను గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చేరవేసేందుకు సిద్ధం చేసిన ఆరోగ్య రథాలను జెండా ఊపి ప్రారంభించారు. సంజీవని కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు, వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, ఆరోగ్య సలహాలు అందించనున్నారు. దూర ప్రాంతాల ప్రజలు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గిస్తూ, వారి వద్దకే వైద్య సేవలను తీసుకెళ్లడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంజీవని కార్యక్రమం కింద డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించుకున్న ఓ గర్భిణితో పాటు మొత్తం 30 మంది లబ్ధిదారులతో ముఖ్యమంత్రి నేరుగా మాట్లాడారు. ఆరోగ్య సేవల నాణ్యత, అందుతున్న వైద్య సదుపాయాలు, ఎదురవుతున్న సమస్యల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ హెల్త్ రికార్డుల ద్వారా ప్రతి వ్యక్తి ఆరోగ్య సమాచారాన్ని సమగ్రంగా భద్రపరచడం వల్ల మెరుగైన వైద్య సేవలు ▶▶2



## నమ్మకద్రోహినే అయితే సజ్జల మాదిరి సంధి చేసుకునేవాడిని: విజయసాయిరెడ్డి



**రాజధాని వాయిస్అమరావతి, ఆగస్టు 29:** తాను ఏనాడూ నమ్మకద్రోహం పనులు చేయలేదని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. తనపై నమ్మకద్రోహి అంటూ వైకాపా కోటరీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. ఈమేరకు ఎక్స్ వేదికగా బహిరంగ లేఖ విడుదల చేశారు. "నేను నమ్మకద్రోహినే అయితే ఆనాడే సజ్జల మాదిరిగా కాంగ్రెస్‌తో సంధి చేసుకునేవాడిని. సీబీఐ, ఈడీ ఛార్జిషీట్లలో నా పేరు లేకుండా చేసుకునేవాడిని. నమ్మకస్తుణ్ని అనే కారణంతో ప్రతి ఛార్జిషీట్‌లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నా పేరు చేర్చింది. జగన్ 16 నెలలు జైల్లో ఉంటే నన్ను 15 నెలలు కారాగారంలో ఉంచారు. నాకు సంబంధం లేని లిక్కర్ స్కామ్‌లోనూ ఏ–5గా చేర్చారు. కాకినాడ సీపోర్టు కేసులో ఏ2గా చేర్చారు.సకల శాఖల మంత్రి పేరు మాత్రం ఇంతవరకు ఏ ఛార్జిషీట్‌లోనూ లేదు. ఏ కేసులూ లేకుండా ఎలానో కోటరీ నాయకుడికి తెలిసినంత నాకు తెలియదు. పార్టీ మారేందుకు సిద్ధమైన ఉత్తరాంధ్ర నేతతో కలిసి కోటరీ నాయకుడు కుట్ర పన్నారు. నాపై అసత్యాలు చెప్పి ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తప్పించారు. జగన్ మెప్పు కోసమే నాస్తికుడిగా చెప్పుకొన్న ఆయన వైకాపాకే కాదు.. రాష్ట్రానికే నమ్మకద్రోహి. నా ఆత్మగౌరవానికి 2020 నుంచి భంగం కలిగించిందెవరు? 2019 ఎన్నికల విజయం తర్వాత సజ్జల ప్రమేయం ఎలా శృతిమించింది? జగన్‌ను ఎవరూ కలవకుండా గోడ కట్టింది సజ్జల కాదా?" అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.

## విజయవాడలో మహిళపై సామూహిక అత్యాచారం?

**రాజధాని వాయిస్ విజయవాడ, ఆగస్టు 29 :** విజయవాడ నగరంలోని వాంబే కాలనీలో ఒంటరిగా ఉంటున్న మహిళపై ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధిత మహిళ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానికుల కథనం ప్రకారం.. వాంబే కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఓ మహిళ ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి స్థానికంగా జులాయిగా తిరిగే ఐదుగురు యువకులు మద్యం మత్తులో ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం మహిళా ఎంతసేపటికీ స్పందించకపోవడంతో చుట్టుపక్కల వారు ఆమెను ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం నున్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో పోలీసులు ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అనంతరం నిందితులను అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు నున్న గ్రామీణ పోలీస్ స్టేషన్ సీఐ తెలిపారు.

# గిరిజనులకు ఇంటి వద్దే వైద్యం



అందించవచ్చని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని ఆధునీకరించేందుకు ప్రభుత్వం పలు సంస్కరణలు అమలు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. సాంకేతికతను వినియోగించి గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని, ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు.గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందించడంలో సంజీవని కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు తెలిపారు. ఆరోగ్య రథాల ద్వారా వైద్య బృందాలు గ్రామాలకు చేరుకుని పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు అందజేస్తాయని వివరించారు. డిజిటల్ ఆరోగ్య రికార్డుల వల్ల ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఉంటుందని చెప్పారు. అరకు వంటి గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సంజీవని కార్యక్రమం గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల అందుబాటును మరింత మెరుగుపరుస్తుందని, రాష్ట్ర ఆరోగ్య రంగంలో ఇది ఒక కీలక ముందడుగుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## తమిళనాడు గవర్నర్‌గా నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. గవర్నర్‌గా రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉండగా, కేంద్రం ఆయన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, శాసనసభ, రాజ్‌భవన్ మధ్య సమన్వయం సాధించడంలో ఆయన అనుభవం ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతున్నారు. కిరణ్‌కుమార్ రెడ్డి నియామకాన్ని పలువురు రాజకీయ నాయకులు స్వాగతించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన ఆయనకు గవర్నర్ పదవి దక్కడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఆయనకు ఉన్న అనుభవం తమిళనాడు రాష్ట్రానికి ఉపయోగపడుతుందని అభినందనలు తెలియ జేశారు.చిత్తూరు జిల్లాకు చెందిన నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ నాయకుడిగా ఎదిగారు. అనంతరం జాతీయ రాజకీయాల్లో కూడా చురుకైన పాత్ర పోషించారు. వివిధ దశల్లో ప్రజాప్రతినిధిగా, పరిపాలకుడిగా ఆయన సేవలు అందించారు. తమిళనాడు గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న కిరణ్‌కుమార్ రెడ్డి త్వరలోనే రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన నియామకంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన మరో ప్రముఖ నాయకుడు రాజ్యాంగబద్ధమైన కీలక పదవిని అధిష్ఠించనున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# పిఠాపురం ఆరోగ్య రంగానికి మహర్దశ



వ్యయంతో 100 పడకల అత్యాధునిక ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నారు. 4.67 ఎకరాల్లో నిర్మితమవుతున్న ఆసుపత్రి పనులు దాదాపు 50 శాతం పూర్తయ్యాయి.ఆసుపత్రిలో ఆధునిక ఐసీయూ, అధునాతన వైద్య పరీక్షా ప్రయోగశాలలు, ఆపరేషన్ థియేటర్లు, 30 పడకల ప్రసూతి విభాగంతోపాటు చిన్నపిల్లలు, కంటి, ఎముకల వైద్యానికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు కానున్నాయి. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే పిఠాపురంతోపాటు పరిసర ప్రాంతాల్లోని ఆరు మండలాలకు చెందిన సుమారు మూడు లక్షల మందికి ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ భవనం, మార్చురీ, లక్ష లీటర్ల సామర్థ్యం గల సంప్ తదితర మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

**రూ.100 కోట్లతో ఆయుష్ వైద్య కళాశాల**

నేషనల్ ఆయుష్ మిషన్ కింద సుమారు రూ.100 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాల ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. కళాశాల, అనుబంధ అభివృద్ధి పనుల కోసం భూసేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ సంస్థ ఏర్పాటుతో వైద్య విద్యకు ఊతమివ్వడంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.

**గ్రామీణ ప్రాంతాలకూ మెరుగైన వైద్యం**

యు.కొత్తపల్లి మండలం కొమరగిరి, గొల్లప్రోలు మండలం చేబ్రోలులో రూ.50 లక్షల చొప్పున నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనులు పూర్తై ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. విరవాడలో రూ.30 లక్షలతో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆయుష్ డిస్పెన్సరీ పనులు తుది దశకు చేరుకున్నాయి.

**కాకినాడలో అధునాతన క్యాన్సర్ చికిత్సా కేంద్రం**

కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రూ.36.6 కోట్లతో అధునాతన క్యాన్సర్ చికిత్సా కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. సీటీ సిమ్యులేటర్, హెచ్‌డీఆర్ బ్రాకీథెరపీ, డోసిమెట్రీ వంటి ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు.పిఠాపురం నియోజకవర్గంలోని ఆసుపత్రులకు రోగుల రాకపోకలకు అనువుగా కనెక్టింగ్ రోడ్ల నిర్మాణంపైనా దృష్టి సారించారు. గ్రామీణ స్థాయి ఆరోగ్య కేంద్రాల నుంచి అత్యాధునిక క్యాన్సర్ చికిత్స వరకు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తోంది.

# గుడివాడలో చిట్టీల ముసుగులో మోసం.. వైసీపీ నేతలపై పోలీసుల చర్యలు

**రాజధాని వాయిస్ కృష్ణాజిల్లా, ఆగస్టు 29 :** కృష్ణాజిల్లాలోని గుడివాడలో చిట్టీల వ్యాపారం పేరుతో మోసానికి పాల్పడ్డారనే ఆరోపణలపై వైసీపీ నేతలు, వారి కుటుంబ సభ్యులపై గుడివాడ వన్‌టౌన్ పోలీసులు చర్యలు చేపట్టారు. మాజీ మంత్రి కొడాలి నాని ప్రధాన అనుచరులు మండాది శ్రీనివాసరావు, ఆయన భార్య మహాలక్ష్మి, కుమారుడు రేవంత్ సాయిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు రూ.51.79 లక్షల మేర మోసం జరిగినట్లు కేసు నమోదైంది. U 318(4), 316(2), 351(2) r/w 3(5) BNS, అలాగే AP Protectors of Depositors of Financial Establishments Act-1999లోని సెక్షన్ 5 కింద గుడివాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ కేసులో మహాలక్ష్మి, ఆమె కుమారుడు రేవంత్ సాయిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం వారికి 14 రోజుల రిమాండ్ విధించింది. ప్రధాన నిందితుడిగా పేర్కొన్న మండాది శ్రీనివాసరావు ప్రస్తుతం పరారీలో ఉండటంతో అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.పోలీసుల దర్యాప్తులో భాగంగా నిందితుడి ఇళ్లలో సోదాలు నిర్వహించి కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 32 మంది చిరు మత్స్యకార కుటుంబాలకు చెందిన సొమ్ము చిట్టీల పేరుతో తీసుకుని తిరిగి చెల్లించలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇంకా అనేక కుటుంబాలు తమకు జరిగిన నష్టంపై బయటకు వచ్చి ఫిర్యాదు చేయలేదని తెలుస్తోంది.మండాది శ్రీనివాసరావు, మహాలక్ష్మి దంపతులు సుమారు 20 ఏళ్లుగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నారని, ఈ క్రమంలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.ఇదిలా ఉండగా, బాధితులు జులై 31వ తేదీన ఫిర్యాదు చేసినప్పటికీ వెంటనే కేసు నమోదు కాలేదనే ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఈ వ్యవహారంపై మీడియాలో కథనాలు రావడంతో మండాది శ్రీనివాసరావు, భార్య, కుమారుడు ఇంట్లోని సామాన్లతో వెళ్లిపోయేందుకు ప్రయత్నించారని బాధితులు తెలిపారు.

# చెట్లు నాటే సంస్కృతే కూటమి లక్ష్యం



ప్రకృతిని తీవ్రంగా దెబ్బతీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. భారతీయ సంప్రదాయంలో ప్రత్యేక ప్రాధాన్యం కలిగిన "అశ్వత్థ నారాయణ వివాహం" ప్రకృతి, ఆధ్యాత్మికతల అద్భుత సమ్మేళనమని నాగబాబు పేర్కొన్నారు. రావి చెట్టును విష్ణుమూర్తికి, వేప చెట్టును లక్ష్మీదేవికి ప్రతీకగా భావిస్తూ ఒకే గుంతలో నాటే ఈ సంప్రదాయం పర్యావరణ పరిరక్షణకు గొప్ప సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. రావి--వేప చెట్లు కలిసి పెరగడం ద్వారా జీవ వైవిధ్యం పెరగడంతో పాటు పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుందని వివరించారు. ప్రకృతి పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లతో తన ఆలోచనలు ఒకే విధంగా ఉన్నాయని నాగబాబు చెప్పారు. రాబోయే తరాలకు మెరుగైన పర్యావరణాన్ని అందించాలనే ఉమ్మడి సంకల్పంతోనే హరిత కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, చెట్లను నరికివేయడంపై మాత్రమే దృష్టి పెట్టారని, మొక్కలు నాటే ఆలోచనకు ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు.పర్యావరణ పరిరక్షణలో భారతదేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలని నాగబాబు అభిప్రాయపడ్డారు. కెన్యా వంటి దేశాలు అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని, జ్ఞానానికి పుట్టినిల్లు అయిన భారత్ కూడా ప్రకృతి పరిరక్షణలో ముందుండాల్సిన అవసరం ఉందన్నారు. చెట్ల పెంపకం, జీవ వైవిధ్య సంరక్షణ, పర్యావరణ అవగాహన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెరగాలని కోరారు. అనంతరం రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల పరిశోధన, శిక్షణ కార్యక్రమాల కోసం రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 'అరణ్యారామం' భవన డిజైన్లను నాగబాబు పరిశీలించారు. భవన నిర్మాణాన్ని 10 నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. నిర్మాణ ప్రక్రియలో తొలగించాల్సి వచ్చిన 73 చెట్లను వేరే ప్రాంతాల్లో విజయవంతంగా పునఃప్రతిష్ఠాపన చేసిన తీరును నాగబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, అటవీ శాఖ ఉన్నతాధికారులు, ఏపీ గ్రీన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకొస్తాం: మంత్రి దుర్గేష్



రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి మంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలకే పరిమితమైన తెలుగును ప్రజల నిత్యజీవితంలోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులు అని కొనియాడారు. కందుకూరి, గురజాడ, గిడుగుల కృషి ఫలితంగానే వ్యావహారిక భాషా ఉద్యమం బలపడిందన్నారు.సవర భాషకు లిపిని రూపొందించడంతో పాటు బ్రిటిష్ ప్రభుత్వం అందించిన పారితోషికాన్ని కూడా ఆదివాసీల విద్యాభివృద్ధికి వినియోగించిన త్యాగధనుడు గిడుగు అని గుర్తుచేశారు. తెలుగు భాషా పురస్కారాల ఎంపికకు సంబంధించిన జీవోను తెలుగులోనే జారీ చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

**ప్రాథమిక విద్య తెలుగులోనే సాగాలి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాతృభాషకు పెద్దపీట వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఇంగ్లిష్, హిందీ నేర్చుకోవడం అవసరమే అయినా మాతృభాషను మరువకూడదన్నారు. ప్రాథమిక విద్య తెలుగులోనే సాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో వ్యావహారిక భాషా సంఘాల ఏర్పాటుకు సాంస్కృతిక శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ప్రతి ఏటా ఉగాది, కందుకూరి, తెలుగు భాషా పురస్కారాలను క్రమం తప్పకుండా ప్రదానం చేస్తామని వెల్లడించారు.

**నంది నాటకోత్సవాలకు సన్నాహాలు**

నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నాటకరంగం ద్వారా భాష ప్రజల హృదయాలకు మరింత చేరువైందని, త్వరలో నంది నాటకోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ మాట్లాడుతూ 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా పేరొందిన తెలుగు భాషకు అగ్రతాంబూలం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగులో రాయడం, మాట్లాడటం, చదవడాన్ని ప్రోత్సహించినప్పుడే గిడుగు ఆశయాలు నెరవేరుతాయని చెప్పారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గిడుగు చేపట్టిన వ్యావహారిక భాషా ఉద్యమం వల్ల తెలుగు సామాన్య ప్రజలకు మరింత చేరువైందన్నారు. సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణ కోసం కృషి చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం చైర్మన్ పూల త్రివిక్రమరావు మాట్లాడుతూ గిడుగు తన జీవితాన్ని వాడుక భాషా వ్యాప్తికి అంకితం చేశారని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో తెలుగు భాష వినిపించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**'కావ్య మల్లికలు' ఆవిష్కరణ**

కార్యక్రమంలో గిడుగు వేంకట రామమూర్తి పంతులు మునిమనవడు నాగేశ్వరరావు రచించిన 'కావ్య మల్లికలు' పుస్తకాన్ని మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు.జంధ్యాల కనకదుర్గ, చందలూరి నారాయణరావు, యు. భూదేవి, కె. పుష్ప, ముత్తేవి రవీంద్రనాథ్, బాలాంతపు వెంకట రమణ, అబ్దుల్ హకీమ్ జాని, ఎస్.వి. రాఘవేంద్రరావు, పి. విజయ్‌కుమార్, బొగ్గవరపు మాల్యాద్రి, చిలుకూరి శ్రీనివాసరావు, నాగసూరి వేణుగోపాలరావు, జంధ్యాల శరత్‌బాబు, కోయి కోటేశ్వరరావు, కే.వి.ఎల్.ఎన్. శర్మ, ఎం. రామకృష్ణ, వీవీఐటీయూ పుస్తక ప్రచురణ సంస్థ, వేమూరి శ్రీనివాస్, కొల్లి రమావతి తదితరులకు తెలుగు భాషా పురస్కారాలు అందజేశారు.పురస్కార గ్రహీతలు తమను గుర్తించి సత్కరించిన మంత్రి కందుల దుర్గేష్, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన మంత్రికి కళాకారులు వివిధ జానపద నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. కళావేదిక ప్రాంగణంలోని తెలుగు తల్లి విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నమస్కరించారు.కార్యక్రమంలో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, జానపద అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య, రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, తెలుగు భాషాభిమానులు, అధికారులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# చేదెక్కిన చక్కెర.. ఘాటెక్కిన ఉల్లి

**రాజధాని వాయిస్ రణస్థలం** నెలరోజుల కిందట కిలో పంచదార ధర రూ.49 ఉండేది. ఇప్పుడు రూ.75కు చేరుకుంది. బ్రాండెడ్ సంస్థలైతే కిలో రూ.80 చొప్పున విక్రయిస్తున్నాయి. కిలో బెల్లం రూ.80 నుంచి రూ.90 వరకూ పెరిగింది. బెల్లం, పంచదారతో తయారుచేసే ప్రతి వస్తువుల ధరలు ఇప్పుడు మార్కెట్‌లో పెరిగాయి. ఆ భారం ప్రజలపై పడుతోంది.రెండు నెలల కిందట కిలో ఉల్లి ధర రూ.20 ఉండేది. గత నెల రూ.37కి చేరగా.. ప్రస్తుతం రూ.55కు పెరిగింది. అదే నాణ్యమైన ఉల్లి దొరకాలంటే రూ.60 చెల్లించాల్సిందే. మున్ముందు ఉల్లి ధర మరింత పెరగవచ్చు అని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో నిర్వాహకులు ఉల్లితో తయారైన వంటకాలపై ధరలు పెంచేసి.. ఆ భారం వినియోగదారులపై మోపుతున్నారు.మార్కెట్‌లో బ్రాండ్ బియ్యం 25 కిలోల బస్తా ధర జూన్ నెలలో రూ.1300 ఉండేది. కానీ ప్రస్తుతం అదే బ్యాగు ధర రూ.1670కు చేరుకుంది. దీంతో వినియోగదారులపై మూడు నెలల కాలంలో రూ.370 భారం పడడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు.అసలే శ్రావణమాసం.. వరుసగా పండుగల సీజన్ వస్తోంది. పిండి వంటలు చేయాలి. కానీ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు చూస్తుంటే.. సామాన్యులు ఏం కొనలేం అన్నట్టు ఉంది పరిస్థితి. ఉల్లి ఘాటెక్కింది. కిలో రూ.55 నుంచి రూ.60కు చేరుకుంది. పంచదార రూ.75కు చేరుకుంది. చింతపండు రూ.80 చేరుకుంది. బియ్యం రేట్లు అమాంతం పెరిగిపోయాయి. వంటనూనెల ధరలు సలసల కాగుతున్నాయి. ఇలా నిత్యావసరాల ధర పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజల ఇంటి బడ్జెట్ 20 శాతం నుంచి 30 శాతానికి పెరిగింది.

# అంబటి రాంబాబుకు చికిత్స విజయవంతం



**రాజధాని వాయిస్ హైదరాబాద్, ఆగస్టు 29 :**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తన ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా స్పందించారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా తన గుండెలో రెండు బ్లాకులు గుర్తించిన వైద్యులు విజయవంతంగా స్టెంట్లు వేశారని తెలిపారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగానే ఉందని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. తనను పరామర్శించేందుకు ఎవరూ హైదరాబాద్‌కు రావద్దని, మరో రెండు రోజుల్లో తానే గుంటూరుకు తిరిగి వస్తానని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అంబటి రాంబాబు స్వల్ప అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సమగ్ర పరీక్షలు నిర్వహించి గుండెకు సంబంధించిన పరీక్షలు చేపట్టారు. అనంతరం యాంజియోగ్రామ్‌లో గుండె రక్తనాళాల్లో రెండు బ్లాకులు ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితిని సమీక్షించిన వైద్యులు వెంటనే స్టెంట్లు అమర్చాలని నిర్ణయించారు.వైద్య బృందం చేపట్టిన చికిత్స విజయవంతంగా పూర్తయిందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అంబటి రాంబాబు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుంటున్నారని పేర్కొన్నాయి. ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కూడా స్పష్టం చేశాయి. ఈ వార్త వెలుగులోకి రావడంతో వైసీపీ శ్రేణులు, అభిమానులు తొలుత ఆందోళనకు గురయ్యారు. పలువురు నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు వెళ్లి పరామర్శించాలని భావించారు. అయితే చికిత్స విజయవంతంగా పూర్తైందని, ఆరోగ్యం మెరుగ్గా ఉందని తెలిసిన తర్వాత పార్టీ వర్గాల్లో ఊరట నెలకొంది.తన ఆరోగ్యంపై వస్తున్న సమాచారానికి స్పందించిన అంబటి రాంబాబు, అభిమానులు చూపుతున్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నానని, త్వరలోనే సాధారణ కార్యకలాపాల్లో పాల్గొంటానని చెప్పారు. తన కోసం ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రెండు రోజుల తర్వాత గుంటూరుకు చేరుకుని అందరినీ కలుస్తానని అంబటి రాంబాబు వెల్లడించారు. ఆయన త్వరగా కోలుకోవాలని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. చికిత్స విజయవంతం కావడంతో పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా జీవితంలో తిరిగి చురుకుగా పాల్గొనాలని కోరుకుంటున్నారు.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

**- తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షాల హెచ్చరిక**
**- ఉత్తరాంధ్ర, రాయలసీమలో భారీ వర్షాల అవకాశం**
**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**



**రాజధాని వాయిస్ హైదరాబాద్, ఆగస్టు 29 :**బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ వ్యవస్థ ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేశారు. ఈ ప్రభావం సెప్టెంబర్ 2 వరకు కొనసాగవచ్చని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు అక్కడక్కడా జల్లులు పడే అవకాశముందని పేర్కొంది. గత వారం రోజులుగా కురిసిన వర్షాలతో ఇప్పటికే చెరువులు, కుంటలు నిండిన నేపథ్యంలో తాజా వర్షాలు మరింత ప్రభావం చూపే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. వ్యవసాయ రంగంపై కూడా ఈ వర్షాల ప్రభావం ఉండనుంది. ఖరీఫ్ పంటల సాగు జరుగుతున్న సమయంలో వర్షాలు ఉపయోగకరంగా మారే అవకాశమున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైతే పంటలకు నష్టం కలిగే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.వర్షాలు, ఈదురుగాలులు, పిడుగులు సంభవించే అవకాశమున్నందున ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో సంచరించవద్దని, చెట్లు, విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద ఆశ్రయం పొందకుండా ఉండాలని హెచ్చరించింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని సూచించింది. వాహనదారులు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వర్షం పడే సమయంలో రహదారులపై జారుడు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున వేగాన్ని నియంత్రిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు. వాతావరణ పరిస్థితులపై అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

# జూద స్థావరాలపై పోలీసుల మెరుపు దాడులు



**రాజధాని వాయిస్ పులివెందుల, ఆగస్టు 29 :** పులివెందుల పరిధిలో జూద స్థావరాలపై పోలీసులు నిర్వహించిన మెరుపు దాడుల్లో 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో రూ.1,70,037 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అక్రమ జూద కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు అందిన సమాచారంతో పలు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించి ఈ చర్యలు చేపట్టారు. పోలీసుల దాడుల సమయంలో జూదం నిర్వహిస్తున్న పలువురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి వద్ద నుంచి నగదుతో పాటు జూదానికి ఉపయోగిస్తున్న ఇతర సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులపై సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పులివెందుల డీఎస్పీ బుక్కె మురళి మాట్లాడుతూ జూదం, మట్కా, అక్రమ మద్యం, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. నేరాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా ఉంచుతున్నామని తెలిపారు.

# కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి: అమిలినేని

*- ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే*
*- కోటి రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణం*
*- వాల్మీకి విగ్రహం, యల్లమ్మ ఆలయానికి విరాళాలు*
*- అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ ప్రాధాన్యం*



**రాజధాని వాయిస్ కుందుర్పి, ఆగస్టు 29 :** రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పెనుకొండ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండలం తెనగల్లు గ్రామంలో నిర్వహించిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణతో కలిసి గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహర్షి వాల్మీకి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించిన తర్వాత ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయంతో అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమం పేరుతో భారీ అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. తెనగల్లు గ్రామంలో ప్రధాన రహదారిని రూ.1 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో కనీస మౌలిక వసతుల అభివృద్ధి కూడా జరగలేదని ఆరోపించారు. గ్రామంలోని కాలనీల్లో కూడా దశలవారీగా సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు.వీరశైవ లింగాయత్ సంఘం ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు యల్లమ్మ ఆలయ అభివృద్ధి కోసం తన స్వంత నిధుల నుంచి రూ.50 వేల విరాళం అందజేశారు. అలాగే గ్రామంలోని మహర్షి వాల్మీకి విగ్రహానికి పైకప్పు నిర్మాణం కోసం రూ.1 లక్ష విరాళం ప్రకటించారు. సామాజిక, ఆధ్యాత్మిక అవసరాల కోసం కూడా తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# హరితాంధ్రప్రదేశ్‌లో పోలీసుల హరిత సంకల్పం

*- పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమం*
*- కమిషనర్ కార్యాలయంలో మొక్కల నాటకం*
*- పచ్చదన విస్తరణే లక్ష్యమన్న సీపీ*
*- ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపు*





**రాజధాని వాయిస్ విజయవాడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన "హరితాంధ్రప్రదేశ్" కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం మొక్కల నాటకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ శ్రీ ఎస్.వి. రాజశేఖర బాబు, ఐపీఎస్ పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు విస్తృత స్థాయిలో మొక్కలు నాటడం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు కీలక అడుగుగా నిలుస్తుందని చెప్పారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు.పోలీస్ శాఖ కూడా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటోందని, కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. నాటిన మొక్కలు పెరిగి పెద్ద చెట్లుగా మారే వరకు వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు. పచ్చదనం పెంపొందించేందుకు అందరూ కలిసి పనిచేయాలని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని కమిషనర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# ముద్దనూరులో ఘనంగా రక్తదాన శిబిరం

**- పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ - 60 మంది స్వచ్ఛందంగా రక్తదానం**
**- సామాజిక సేవలో పోలీసుల ముందడుగు - రక్తదానంపై అవగాహన కల్పించిన అధికారులు**





**రాజధాని వాయిస్ ముద్దనూరు, ఆగస్టు 29 :** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముద్దనూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ముద్దనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పోలీసు సిబ్బందితో పాటు స్థానిక యువకులు, స్వచ్ఛంద సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం 60 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితులు, శస్త్రచికిత్సలు, రక్తహీనత వంటి సందర్భాల్లో రక్తం అత్యంత అవసరమవుతుందని తెలిపారు. ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని వివరించారు.రక్తదాన శిబిరం ద్వారా సమాజంలో రక్తదానం పట్ల అవగాహన పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రక్తదానం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని, ఇది పూర్తిగా సురక్షితమైన ప్రక్రియ అని వైద్య నిపుణులు పాల్గొన్న వారికి వివరించారు. యువత రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ముద్దనూరు పోలీస్ స్టేషన్ అధికారులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా తరచూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలతో పోలీసుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ అధికారులు అభినందించారు.శిబిరంలో పాల్గొన్న రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేసి వారి సేవాభావాన్ని ప్రశంసించారు. అత్యవసర సమయాల్లో రక్త కొరతను నివారించేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రక్తదానం చేసిన వారి సహకారంతో అనేక మంది రోగులకు అవసరమైన రక్తం అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, వైద్య బృందం సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

# తెలుగు భాషా వికాసానికి గిడుగు సేవలు చిరస్మరణీయం

**- అధికార భాషా దినోత్సవం ఘనంగా నిర్వహణ**
**- గిడుగు రామమూర్తికి కలెక్టర్ నివాళులు**
**- వ్యవహారిక భాష ఉద్యమంపై ప్రశంసలు**
**- తెలుగు భాష పరిరక్షణకు పిలుపు**





**రాజధాని వాయిస్ గుంటూరు, ఆగస్టు 29 :** వ్యవహారిక భాష పితామ హుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం తెలుగు అధికార భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తెలుగు భాషను ప్రజలకు మరింత చేరువ చేసిన మహనీయుడిగా గిడుగు రామమూర్తి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి భాషా సంస్కరణ ఉద్యమానికి మార్గదర్శకుడిగా నిలిచారని అన్నారు. పండితులకే పరిమితమైన గ్రాంథిక భాషకు బదులుగా ప్రజలకు సులభంగా అర్థమయ్యే వ్యవహారిక భాషను ప్రోత్సహించేందుకు నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. భాష ప్రజల జీవన విధానానికి దగ్గరగా ఉండాలని ఆయన భావించిన దూరదృష్టిని గుర్తు చేశారు.సవర గిరిజనుల అభ్యున్నతి కోసం గిడుగు రామమూర్తి చేసిన కృషి విశేషమని కలెక్టర్ తెలిపారు. సవర భాషను స్వయంగా నేర్చుకుని ఆ భాషలో పుస్తకాలు రచించడంతో పాటు సవర పిల్లల కోసం పాఠశాలలు ఏర్పాటు చేశారని చెప్పారు. సవర భాషకు లిపి, వ్యాకరణం, నిఘంటువు రూపొందించడం ద్వారా ఆ భాష అభివృద్ధికి అపూర్వ సేవలు అందించారని కొనియాడారు. భాషా సేవలకు గుర్తింపుగా గిడుగు రామమూర్తికి ప్రభుత్వం 'కైజర్–ఏ–హింద్' స్వర్ణ పతకాన్ని ప్రదానం చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. తెలుగు భాషను ప్రజల భాషగా నిలబెట్టడంలో ఆయన పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. భాషా పరిరక్షణతో పాటు సంస్కృతి, సంప్రదాయాల సంరక్షణకు కూడా ఆయన కృషి ఆదర్శనీయమని చెప్పారు.తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతిని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. మాతృభాషపై గౌరవం పెంపొందించుకోవాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార భాష వినియోగాన్ని మరింత విస్తరించాలని సూచించారు. తెలుగు భాష అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గిడుగు రామమూర్తి సేవలను స్మరించుకుంటూ తెలుగు భాషా వికాసానికి కట్టుబడి పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# శక్తి యాప్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు





**రాజధాని వాయిస్ బాపట్ల :** మహిళల భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో బాపట్ల జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు శక్తి బృందాలు జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో మహిళలు, యువతను కలుసుకుని శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించాయి. ఈ సందర్భంగా మహిళల భద్రత కోసం రాష్ట్ర పోలీసు శాఖ అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ ప్రత్యేకతలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఒకే క్లిక్‌తో పోలీసులకు సమాచారం చేరే విధానం, తక్షణ సహాయం పొందే సౌకర్యం గురించి తెలియజేశారు. యాప్‌ను ప్రతి మహిళ తన మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు.శక్తి బృందాలు యువతకు సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్ వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించాయి. అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, భయపడకుండా ఫిర్యాదు చేయాలని సూచించాయి. మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా కల్పించాయి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణించే మహిళలకు వ్యక్తిగత భద్రతా జాగ్రత్తలపై సూచనలు అందించారు. అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే శక్తి యాప్ లేదా పోలీసు హెల్ప్‌లైన్‌ను వినియోగించాలని తెలిపారు. భద్రతపై అప్రమత్తత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.మహిళల సాధికారత, భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని అధికారులు తెలిపారు. శక్తి యాప్ వాటిలో కీలక సాధనంగా మారిందని, మహిళలకు వేగవంతమైన సహాయం అందించడంలో ఇది సమర్థవంతంగా పనిచేస్తోందని వివరించారు. ప్రతి మహిళ ఈ సాంకేతిక సదుపాయాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమాలకు మహిళలు, యువత నుంచి మంచి స్పందన లభించింది. శక్తి యాప్‌పై అవగాహన పెంపొందించడం ద్వారా మహిళల భద్రతను మరింత బలోపేతం చేయాలన్నదే లక్ష్యమని పోలీసులు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# గుడ్లవల్లేరులో రూ.4.17 కోట్ల రోడ్ల పనులకు శ్రీకారం

**- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే - గ్రామీణ రవాణా సౌకర్యాల మెరుగుదలపై దృష్టి - ప్రజల విజ్ఞప్తులకు స్పందించి నిధుల మంజూరు**
**- అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న రాము**





**రాజధాని వాయిస్ గుడ్లవల్లేరు, ఆగస్టు 29 :** కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలంలో సాస్కి నిధులతో రూ.4.17 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు రహదారి అభివృద్ధి పనులకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభిం చారు. వివిధ గ్రామాల్లో కూటమి నాయకులు, ప్రజల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారుల నిర్మాణం కీలకమని పేర్కొన్నారు. ఇప్పటికే విన్నకోట, కట్టవాని చెరువు గ్రామాల్లో రూ.74 లక్షల వ్యయంతో రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. తాజాగా పోలిమెట్ల--పెంజంద్ర రహదారికి రూ.1.10 కోట్లు, కౌతవరం--చేవేంద్ర రోడ్డుకు రూ.1.80 కోట్లు, గాదెపూడి ఎం.ఎన్.కే. రహదారికి రూ.57 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత గ్రామాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు.చాలా కాలంగా రహదారులు అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గత పర్యటనల్లో గ్రామస్తులు ఈ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు. పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రహదారుల నిర్వహణ, అభివృద్ధిపై సరైన దృష్టి లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల పరిస్థితి దెబ్బతిన్నదని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి లభిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ మారుమూల గ్రామాలకు కూడా నాణ్యమైన రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మెరుగైన రహదారులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. రైతులు తమ పంటలను మార్కెట్లకు సులభంగా తరలించడంతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని చెప్పారు.

## మండాది బోడు వద్ద రోడ్డు ప్రమాదం వ్యక్తికి తీవ్ర గాయాలు



**మాచర్ల రూరల్.ఆగస్టు 29 రాజధాని వాయిస్:** మండల పరిధిలోని మండాది బోడు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడి వివరాల ప్రకారం. దుర్గి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కొండ యలమంద మరో వ్యక్తితో కలిసి సిరిగిరిపాడులో పాలిష్ రాయి పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై మాచర్ల వైపు వస్తుండగా, మండాది బోడు వద్ద గుర్తుతెలియని వాహనం వీరిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన యలమందను స్థానికులు వెంటనే మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సూర్య నారాయణ యంత్రములు ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా



**రాజుపాలెం.ఆగస్టు 29,రాజధాని వాయిస్ :** మండలంలో దేవరంపాడు గ్రామం, మత్స్యావతార శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం ప్రాంగణం నందు కన్నా క్రాంతి యంత్రం, జయదేవ్ శంకుయంత్రం,సూర్యనారాయణ యంత్రములు ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు,సత్తెనపల్లి శాసన సభ్యుడు కన్నా లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు దరువూరి నాగేశ్వర రావు,ఈఓ గణపతి సురేష్,దేవస్థాన కమిటీ ఛైర్మన్ తెలగనేని వెంకటేశ్వర్లు, మండల టిడిపి అధ్యక్షుడు అంచుల నరసింహా రావు,గ్రామ టిడిపి అధ్యక్షుడు పత్తిపాటి వెంకయ్య, వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

## గిడుగు వెంకట రామమూర్తికి ఘన నివాళులు




**పిడుగురాళ్ళ.ఆగస్టు 29,రాజధాని వాయిస్:** పిడుగురాళ్ల, రాజుపాలెం కొండమోడు కె.ఎన్.ఆర్ విద్యాసంస్థలనందు గిడుగు వెంకట రామమూర్తి జయంతి తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, బాడిస మస్తాన్ రావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనం ప్రపంచాన్ని అందుకోవడానికి ఇంగ్లీష్‌తో పాటు అనేక భాషలు నేర్చుకుంటున్నామని, కొత్త భాషలు నేర్చుకోవడం అభివృద్ధికి సూచిక. కానీ ఒక విషయం మాత్రం ఎప్పటికీ మరవకూడదు,ఎన్నిభాషలునేర్చుకున్నా, మన మాతృభాషకు ప్రత్యామ్నాయం లేదు అన్నారు. తెలుగు అధ్యాపకుల వంగివరపు రాజా మాట్లాడుతూ, మనమందరం ఒక సంకల్పంచేద్దాం, ప్రతిరోజూ తెలుగును ప్రేమిద్దాం,తెలుగును గౌరవిద్దాం,తెలుగు సాహిత్యాన్ని చదివిద్దాం, తెలుగు గొప్పతనాన్ని భావితరాలకు అందిద్దాం,మన భాష మన గర్వం,మన సంస్కృతి మన బలం,తెలుగు తల్లి మన ఆత్మగౌరవం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తెలకపల్లి గోపికృష్ణ, దీపంగి సురేష్, బి. యాకోబు, కోనేటి ప్రసన్న, బి.ఇందు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పిన్నెల్లి వెంకటరామిరెడ్డి జన్మదిన వేడుకలు



**కారంపూడి.ఆగస్టు 29రాజధాని వాయిస్** :మండల కేంద్రమైన కారంపూడి పట్టణంలోని ప్రైమరీ స్కూల్లో ఘనంగా రాష్ట్ర వైఎస్ఆర్సిపి నాయకుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షురాలు కిల్లారత్నకుమారి ఘనంగా నిర్వహించారు. ముందుగా కేకులు కట్ చేసి పిన్నెల్లి వెంకటరామిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కాశీ విశ్వనాథం, యాసిన్, వైఎస్ఆర్సిపి యువ నాయకులు షేక్ మస్తాన్,జిలాని, వహీద్ వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాచర్లలో నేరాల నియంత్రణకు 30 సీసీ కెమెరాలు

### - గొలుసుకట్టు యాప్‌లపై సీఐ హెచ్చరిక



**మాచర్ల.ఆగస్టు 29 రాజధాని వాయిస్ :** పట్టణంలో ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తూ నేరాల నియంత్రణ కోసం ముమ్మర చర్యలు చేపడుతున్నట్లు మాచర్ల పట్టణ సీఐ నజీర్ బేగ్ తెలిపారు. పట్టణ ప్రజల సహకారంతో మాచర్లలోని అన్ని ప్రధాన కూడళ్లలో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ద్విచక్ర వాహనాల చోరీలను అరికట్టడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచేందుకు ఈ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చర్యలు చేపడుతోందన్నారు. సీసీ కెమెరాల నిఘాతో అనుమానాస్పద కదలికలను గుర్తించి నేరాలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

**గొలుసుకట్టు యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలి**

ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న గొలుసుకట్టు (చైన్ లింక్) స్కీమ్‌లు, యాప్‌ల పట్ల యువతతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ నజీర్ బేగ్ హెచ్చరించారు. ఇటువంటి యాప్‌లు తొలుత కొంత డబ్బు ఇచ్చి ప్రజల్లో ఆశ కల్పిస్తాయని, అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించేలా ప్రలోభాలకు గురిచేసి మోసాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పద యాప్‌లు లేదా ఆర్థిక పథకాలపై పూర్తి సమాచారం తెలుసుకోకుండా డబ్బులు పెట్టవద్దని సూచించారు. ప్రజల భద్రతకు పోలీసు శాఖతో ప్రతి ఒక్కరూ సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# సాగర్ కుడి కాలువకు తాగునీటి విడుదల

### - చెరువులు, కుంటలు నింపుకోవాలని అధికారుల సూచన

**కారంపూడి.ఆగస్టు 29రాజధాని వాయిస్ :**నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా తాగునీటి అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ అధికారులు నీటిని విడుదల చేశారు. కృష్ణా బోర్డు ఆదేశాల మేరకు పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం, మార్కాపురం జిల్లాల పరిధిలోని తాగునీటి ఎద్దడిని నివారించేందుకు 8 టీఎంసీల నీటిని కేటాయించారు. ఈ నీటితో ఐదు జిల్లాల పరిధిలోని 442 చెరువులు, 3,308 కుంటలను పూర్తిస్థాయిలో నింపుకోవాలని అధికారులు సూచించారు. ఈ నిల్వల ద్వారా స్థానిక తాగునీటి సమస్య తీరడంతో పాటు భూగర్భ జలమట్టాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. విడుదల చేసిన జలాలను కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పంట పొలాలకు మళ్లించరాదని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి నీటిని మళ్లిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలువ చివరి ఆయకట్టు వరకు నీరు సజావుగా చేరేలా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు 137 కిలోమీటర్ల మేర ఐదు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి, 24 గంటల పాటు గస్తీ నిర్వహిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, జలవనరుల శాఖల అధికారులు సంయుక్తంగా నిరంతర పర్యవేక్షణ చేపడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.



# విక్రమ్-1 విజయ గగనంలో చీరాల యువతేజం రాకేష్ : ఎమ్మెల్యే కొండయ్య

- రాకేష్ ను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే
- తొలి ప్రైవేటు రాకెట్ తయారీ బృందంలో చీరాల, ఉడ్ నగర్ వాసి రాకేష్
- నేటి యువతకు రాకేష్ ప్రతిభ స్ఫూర్తిదాయకమని వెల్లడి



**చీరాల ఆగస్టు 29రాజధాని వాయిస్: :** భారత అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్రకు నాంది పలికిన విక్రమ్-1 తొలి ప్రైవేటు రాకెట్ విజయవంతమైన ప్రయోగంలో ప్రతిభ కనబరిచిన బృందంలో చీరాల యువకుడు గారపాటి రాకేష్ భాగస్వామిగా ఉండటం చీరాల పట్టణానికే కాకుండా బాపట్ల జిల్లాకే గర్వకారణమని చీరాల శాసనసభ్యులు ఎం.ఎం. కొండయ్య పేర్కొన్నారు. దేశ తొలి ప్రైవేటు రాకెట్ తయారీ బృందంలో పనిచేసి తన ప్రతిభను చాటుకున్న రాకేష్‌ను శనివారం చీరాల కొత్తపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ భారత అంతరిక్ష చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న విక్రమ్-1 ప్రయోగంలో తమ నియోజకవర్గమైన చీరాల యువకుడు భాగస్వామి కావడం ఎంతో ఆనందకరమైన విషయమన్నారు. దేశ తొలి ప్రైవేటు రాకెట్ తయారీలో తన ప్రతిభను చాటుకుని చీరాల పేరు దేశవ్యాప్తంగా వినిపించేలా చేసిన గారపాటి రాకేష్‌ను ప్రతి ఒక్కరూ అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. చీరాల పట్టణంలోని ఉడ్‌నగర్ ప్రాంతానికి చెందిన రాకేష్ సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి ఎన్నో కష్టాలను అధిగమిస్తూ నేడు దేశ ప్రతిష్ఠాత్మక అంతరిక్ష రంగంలో తన ప్రతిభను నిరూపించుకోవడం యువతకు గొప్ప స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భారత అంతరిక్ష ప్రయోగాల్లో కొత్త చరిత్ర సృష్టిస్తూ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిన విక్రమ్-1 రాకెట్ తయారీ బృందంలో గారపాటి రాకేష్ ఒకరిగా పనిచేశారు. రాకెట్ తయారీకి సంబంధించిన మాన్యుఫ్యాక్చరింగ్ విభాగంలో బాధ్యతలు నిర్వర్తిస్తూ, ప్రయోగానికి అవసరమైన కీలక భాగాల తయారీ, వాటి నాణ్యత, కచ్చితత్వం వంటి అంశాల్లో తనవంతు సేవలు అందించారు. రాకెట్ ప్రయోగం అంటే కేవలం కొద్ది నిమిషాల్లో జరిగే ప్రక్రియ మాత్రమే కాదని, దాని వెనుక ఎన్నో సంవత్సరాల పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, రూపకల్పన, తయారీ, పరీక్షలు, నిరంతర శ్రమ ఉంటాయని ఎమ్మెల్యే అన్నారు. అలాంటి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రాకెట్ తయారీ ప్రక్రియలో చీరాల యువకుడు భాగస్వామిగా ఉండటం ఎంతో విశేషమన్నారు. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయినప్పటికీ ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు సాగి నేడు అంతరిక్ష రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవడం రాకేష్ గొప్ప విజయమని ఎమ్మెల్యే కొండయ్య కొనియాడారు. ఎదురైన ప్రతికూల పరిస్థితులను అధిగమించి కష్టపడే స్వభావం, నేర్చుకోవాలన్న తపన, పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరుకోవడం నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ప్రతి యువకుడు రాకేష్ జీవిత ప్రయాణం నుంచి స్ఫూర్తి పొందాలని, ప్రతిభతో పాటు కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే సాధించలేనిది ఏదీ లేదని ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య అన్నారు. చీరాల నేలపై పెరిగి దేశ అంతరిక్ష రంగంలో తన ప్రతిభను చాటుకుని, దేశ తొలి ప్రైవేటు రాకెట్ తయారీ బృందంలో భాగస్వామిగా నిలవడం చీరాలకే గర్వకారణమన్నారు. చీరాల నుంచి వెళ్లి దేశ అంతరిక్ష రంగంలో తన ప్రతిభతో ముద్ర వేసిన గారపాటి రాకేష్ మరిన్ని ఉన్నత విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి, చీరాల ప్రాంతానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసం ఉంటే ఎలాంటి పరిస్థితుల నుంచైనా ఎదిగి దేశస్థాయిలో గుర్తింపు పొందవచ్చని రాకేష్ జీవితం నిరూపిస్తోందని, ఆయన విజయ ప్రస్థానం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య పేర్కొన్నారు. అనంతరం పట్టణ ప్రముఖులు కూటమి నాయకులు రాకేష్ ను అభినందించారు.

# యువత ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవాలి

**చీరాల ఆగస్టు 29రాజధాని వాయిస్:** బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు ఆధ్వర్యంలో శనివారం కళాశాల ప్రాంగణంలో యువతీ యువకులకు నూతన ఓటు నమోదు, ఓటు హక్కు, బ్యాంకింగ్ సేవలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవడం ద్వారా సమర్థవంతమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించడంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. నూతన ఓటర్లు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన పెంచుకొని, ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపుని చ్చారు.

ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కట్ట బదరినాగ్ జీరో బ్యాలెన్స్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ తదితర బ్యాంకింగ్ సేవలపై విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా విద్యార్థి దశ నుంచే ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతాలను నిర్వహించడం, సేవింగ్స్ అకౌంట్ ద్వారా కలిగే ప్రయోజనాలు, జీరో బ్యాలెన్స్ అకౌంట్ వంటి బ్యాంకింగ్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## కంపచెట్లలోకి దూసుకెళ్లిన కారు తప్పిన పెను ప్రమాదం



**కారంపూడి.ఆగస్టు 29రాజధాని వాయిస్** :మండల పరిధిలోని పేటసన్నిగండ్ల శివారు వంతెన సమీపంలో శనివారం ఓ కారు ప్రమాదానికి గురైంది. నరసరావుపేట-మాచర్ల ప్రధాన రహదారిపై నరసరావుపేట నుంచి కారంపూడి వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న కంపచెట్లలోకి దూసుకెళ్లింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి కారులోని ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

## దుర్గి మోడల్ స్కూల్‌లో ఘనంగా క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలు




**దుర్గి. ఆగస్టు 29రాజధాని వాయిస్:**మండల కేంద్రంలోని పి.ఎం.శ్రీ ఎ.పి. మోడల్ స్కూల్‌లో క్రీడా దినోత్సవం మరియు తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రెహమాన్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వికాసానికి చదువుతో పాటు క్రీడలు, మాతృభాషా జ్ఞానం ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు విద్యార్థులలో క్రమశిక్షణ, గెలుపోటములను సమానంగా స్వీకరించే మనోధైర్యాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. అలాగే మాతృభాష అయిన తెలుగు వైభవాన్ని, సంస్కృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వివిధ ఆటల పోటీలతో పాటు తెలుగు భాషా ప్రాముఖ్యతపై వ్యాసరచన, వక్తృత్వ, కవితల పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ప్రిన్సిపాల్, ఎస్ఎంసీ ఛైర్మన్, ఉపాధ్యాయుల చేతుల మీదుగా జ్ఞాపికలు, పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెహమాన్, ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పియంఏవై ఆవాస్ యోజన ఇళ్లను పరిశీలించిన హౌసింగ్ ఎం.డి హెప్సిబారాణి



**పల్నాడు ఆగస్టు 29రాజధాని వాయిస్:**హౌసింగ్ ఎం.డి హెప్సిభా రాణి ఐఏఎస్ శనివారం పల్నాడు జిల్లాలోని మాచర్ల, దుర్గి, వెల్దుర్తి మండలాలలో పర్యటించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద కొత్తగా మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను హౌసింగ్ ఎం.డి హెప్సిభారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని లబ్ధిదారులకు, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. గృహ నిర్మాణ పనులపై క్షేత్రస్థాయిలో సమీక్షలు నిర్వహించి తప్పకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు దశల వారీగా నిర్మాణ పనులు పూర్తి చేయించి బిల్లులను ఆన్లైన్లో సమర్పించాలన్నారు. లబ్ధిదారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఈ టి.వేణుగోపాల్, పల్నాడు స్పెషల్ ఆఫీసర్ శంకర్రావు, జిల్లా హౌసింగ్ పీడీ పి.ప్రసాద్, మాచర్ల డిఈఈ. బాలాజీ నాయక్, పల్నాడు జిల్లా డీఈలు శ్రీనివాస్ రెడ్డి , వెంకటేశ్వరరావు , ఈఈ శివలింగం, హౌసింగ్ ఏఈ సాతులూరి మరియదాసు, వర్క్ ఇన్స్పెక్టర్లు కిన్నెర తేజ,తండ అలీ,ఎలిసమ్మ, అమరలింగయ్య,సంతోష్ పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయ శంకుస్థాపనకు ఆహ్వానం



**వేటపాలెం ఆగస్టు 29రాజధాని వాయిస్:** : మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం గ్రామంలో సెప్టెంబర్ 5న నిర్వహించనున్న ఆంజనేయస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి గ్రామస్థు లు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకులు, పెద్దలు, పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కీర్తిపూర్ణ ఆధ్వర్యంలో చీరాల టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ మద్దులూరి మహేంద్రనాద్ కలిసి శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరై విజయ వంతం చేయాలని కోరారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com